# నిష్కామ కర్మయోగి-బాలగోపాల్

**బాలగోపాల** హఠాన్మరణం మనసును కలచి వేసింది. ఆ దుఃఖ వివశతలో వుండగానే ఒక మిత్రుడు ఫోన్ చేసి 'ఆంధ్ర రాష్ట్రం ఒక కర్మయోగిని, ఒక రుషిని కోల్పోయింది' అన్నాడు. తన జీవిత పర్యంతం మానవ హక్కుల కోసం, పీడితుల కోసం నిష్కామంగా పోరాడిన బాలగోపాల్‌కి కర్మయోగి అన్నపదం ఖచ్చితంగా సరిపోతుందేమో.

బెర్ట్రాండ్ రస్సెల్ దార్శనికత స్ఫూర్తిగా సామాజిక కార్యాచరణకు పూనుకున్న బాలగోపాల్ ఆయనలాగే ప్రతి సంక్షుభిత సామాజిక సందర్భంలోనూ పీడితుల పక్షమే వహించాడు. వాకపల్లి గిరిజనులు కానీ, పోలేపల్లి బాధితులు కానీ సింగరేణి ఓపెన్ కాస్ట్ బాధితులు కానీ, ఎవరయినా సరే ప్రతి బాధితుడి గుండెల్లోనూ బాలగోపాల్ చిరంజీవి.

"భారత సమాజంలో రెండు భిన్నమైన వర్గాలే కాదు. ఎవరూ పట్టించుకోకుండా, చాప కింద నీరులా పెరిగిపోతున్న మూడో వర్గమూ వుంది. ఇందులో మొదటిది ఇండియా. ఇది బాగా అభివృద్ధి చెందిన వర్గానికి ఊతపదం. రెండవది భారత్. ఇది గ్రామీణ అభివృద్ధి చెందని వర్గానికి పర్యాయపదం. మూడవది మినీ అమెరికా లేదా నయా న్యూయార్క్. యిది ప్రపంచస్థాయి మౌలిక వసతులు కలిగిన ద్వీపంలాంటిది" అంటూ భారత సమాజంలో తామరతంపరగా పెరిగిపోయిన నియోరిచ్ కల్చర్ గురించి బాల్‌గోపాల్ విశ్లేషించాడు.

బాలగోపాల్‌కి యితర మార్క్సిస్టు మేధావులకు మధ్య వున్న ప్రధానమైన తేడా అల్లా ఒకటే. యితర మార్క్సిస్టు మేధావులు సమాజాన్ని సిద్ధాంత గ్రంథాల పుటల్లోంచి

వీక్షిస్తే, బాలగోపాల్ మాత్రం ప్రజల ఆలోచనల్లోంచి మానసిక ఉద్వేగాలలోంచి సిద్ధాంత గ్రంథాల పుటలను చదివాడు. కనుకనే ఆయన ఆచరణకి, ఆచరణ పథానికి అంత నిజాయితీ, నిబద్ధత.

"నక్సలైట్ల వ్యూహాత్మక ఆలోచనలు ఎప్పుడూ రాజ్యాన్ని రాజకీయంగా ఓడించే దిశగా కాకుండా, సాయుధ పోరాట కోణంలోనే సాగుతున్నాయి. రాజకీయ ఓటములు, అసమానతలు, విధ్వంసక అభివృద్ధి వంటి విషయాలకు నక్సలైట్ల అజెండాలో చోటులేదు. ఒకటి మాత్రం వాస్తవం. ఒక వేళ ఆ దిశగా ఆలోచించినా అలాంటి నిర్ణయాలను, శక్తులను నిలువరించేది ఎలాగనే విషయంలో వారికే ఒక స్పష్టమైన అవగాహన లేదు. ఇంకా నేరుగా చెప్పాలంటే ప్రశ్నించినట్లుగా ఒక స్పెషల్ ఎకనమిక్ జోన్‌గాని, ఒక భారత్, అమెరికా అణు ఒప్పందాన్ని గానీ ప్రశ్నించలేదు" అంటూ నక్సలైట్ల ఉద్యమాన్ని విశ్లేషిస్తూ ఉద్యమం అంటే కేవలం సాయుధ పోరాటం మాత్రమే కాదు అంటూ అభిప్రాయపడ్డాడు.

సాధన రాసిన రాగో నవలకి బాలగోపాల్ ముందు మాట నుండే బాలగోపాల్ ఆలోచనల్లో అనూహ్యమైన మార్పు మొదలైంది అనుకోవచ్చు.

పౌరహక్కుల సంఘానికి అన్నీ తానై పెంచి పోషించిన బాలగోపాల్ "రాజ్యహింసతోపాటు ప్రైవేటు హింసనూ వ్యతిరేకించే క్రమంలో దానితో విభేదించి1996లో బయటికి వచ్చి మానవ హక్కుల వేదికను స్థాపించారు. అక్కడ నుండి ఆయన కార్యాచరణ మరింత విస్తృతమయింది. మార్క్సిజం నుండి ఆయన పక్కకు పోవడంపై రంగనాయకమ్మ రాసిన కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు అంటూ రాసిన పుస్తకం అప్పట్లో సంచలనానికి కారణమయింది. "ఆధిపత్య భావజాలం మానవ స్వభావంలోనే వుంది" అన్న ఆయన వ్యాఖ్య బాగా వివాదాస్పదమైంది.

బాలగోపాల్ విలక్షణ దృష్టికి మరొక దృష్టాంతాన్ని కూడా చెప్పుకోవచ్చు. కర్నాటక రాష్ట్రం ఆల్మట్టి ఎత్తు పెంచినందున కృష్ణా డెల్టా ఎడారిను మారిపోతుందంటూ తెలుగు మేధావులు, రాజకీయ నాయకులు పుంఖాను పుంఖాలుగా వ్యాసాలు రాస్తూ, ఉద్యమాలు చేస్తున్న సందర్భంలో ఆయన ఒక వ్యాసంలో ఆల్మట్టి ఎత్తు పెంపుదల వల్ల కర్నాటకలోని దుర్భిక్ష పీడిత ప్రాంతాలయిన బీజాపూర్, చదర్, గుల్బర్గా ప్రాంతాల ప్రజలు లాభపడతారు అంటూ ఆంధ్రజ్యోతిలో ఆయన రాసిన వ్యాసం కూడా వివాదాస్పదమయింది.

ప్రభాకరన్ మృతి తర్వాత శ్రీలంకలోని తమిళుల భవిష్యత్తు గురించి విశ్లేషణ చేస్తూ వచ్చిన అతి తక్కువ వ్యాసాలలో బాలగోపాల్ వ్యాసం కూడా ఒకటి.

మనిషి సహజంగా పుడతాడు. ఎంత సహజంగా పుడతామో అంతే సహజంగా జీవించాలి. అంతే సహజంగా మరణించాలన్న సూత్రాన్ని నమ్మి దాన్ని జీవితానికి అనుసంధానించి, ఆచరించి చూపిన అరుదైన వ్యక్తి బాలగోపాల్.

చరిత్ర, సంస్కృతి, సాహిత్యం పట్ల ఎంతో మక్కువ కలిగిన బాలగోపాల్ డి.డి. కోశాంబి లాంటి సామాజిక తత్త్వవేత్తలను తెలుగు పాఠకులకు సరళంగా పరిచయం చేస్తూ ఎన్నో విలువైన పుస్తకాలను రాశారు. ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో ఆయన రాసిన విషయాలు ఎంతో విలువైనవి.

బాలగోపాల్‌ను మార్క్స్ మోహపెట్టకపోతే ఆయన గణితశాస్త్రంలో మరో శ్రీనివాస రామానుజన్ అయ్యేవారని ఆయనను బాగా తెలిసిన సన్నిహిత మిత్రులంటారు. సాహిత్యంవైపు పూర్తిగా మొగ్గినట్లైతే గొప్ప సాహితీవేత్త అయ్యేవారు. కాని సామాజిక కార్యాచరణ ఆయనను రా, రమ్మని పిలిచినది.

రాయలసీమలో పుట్టి తెలంగాణ పల్లెలను ప్రేమగా కౌగిలించుకున్న బాలగోపాల్ ఈ రాష్ట్రంలో తిరగని పల్లె లేదు. నిజనిర్ధారణ కోసం చూడని ప్రదేశం లేదు.

కాలుష్యం, విద్య, వ్యాపారం, సెజ్‌లు, మానవహక్కులు ఇలా ఏ రంగాన్ని తీసుకున్నా, ఏ విషయాన్ని తీసుకున్నా తనదైన కొత్తకోణాన్ని చూపేవారు. మన అభిప్రాయాలకు కొత్త కొత్త రూపాన్ని యిచ్చేవారు.

బాలగోపాల్ ఉపన్యాసాలని ఖమ్మంలో ఇంకా వింటున్నట్లే వుంది. బాలగోపాల్ లేరంటే నమ్మబుద్ధి కావడంలేదు. కాని వాస్తవం కల కాదుకదా!

ఈ రాష్ట్రంలో ఏ మారుమూల ఆయనకు ఎవ్వరూ ఒక విగ్రహం కూడా పెట్టకపోవచ్చు. కాని ప్రజలు, మరి ముఖ్యంగా పీడితుల గుండెల్లో ఆయన విగ్రహం ఎత్తు ఆరు కాదు అరవై అడుగులు.

తెలుగు సాహిత్యంలో శ్రీశ్రీకి ముందు వెనుక అంతా శూన్యం అనడంలో కారణాలు నాకు తెలియదు కానీ బాలగోపాల్ కృషి చేసిన మానవ హక్కుల రంగంలో ఆయనకు ముందు అంతా శూన్యం. తరువాత ఏమో...

నిష్కామ కర్మయోగి బాలగోపాల్.

– వంశీకృష్ణ